సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



సమస్యల్లో జీపీలు..
జీపీ కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారం కాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- 8లో ▸



రెగ్యులరైజ్ చేయాలి..
తెయూలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.9 /24.3
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేంద్ర పనులకు రెండు బిల్లులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 'స్పెషల్ అసిస్టెన్స్ ఆఫ్‌క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం' ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మాణం చేసిన రోడ్లు, ఆస్పత్రి భవనాలకు సంబంధించి తెలంగాణలో రెండుసార్లు బిల్లులు డ్రా చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారంటూ ఎంపీ అర్వింద్ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్మలను ఎంపీ అర్వింద్ ఢిల్లీలో కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే చేసిన పనులకు బిల్లులు చేసుకుని, మళ్లీ వాటి పేరుమీదనే కేంద్రం నుంచి వచ్చిన నిధులను స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్కీం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.5,221 కోట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో డబుల్ బిల్లింగ్ చేసిన వ్యవహారాలు బయటపడినట్లు ఎంపీ ఫిర్యాదులో వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పూర్తి విచారణ చేసి దోషులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

హైకోర్టు జడ్జీలను కలిసిన న్యాయవాదులు



ఖలీల్‌వాడి : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులై సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన కె సుజన, లక్ష్మీనారాయణలను నిజామాబాద్ న్యాయవాదుల బృందం సోమవారం కలిసింది. హైకోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులను సంబంధించిన ఛాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి పూలగుచ్ఛం అందించి సన్మానించారు. న్యాయమూర్తి లక్ష్మీనారాయణ జిల్లాలోని మెండోరా గ్రామానికి చెందినవారని, హైకోర్టు న్యాయమూర్తి సుజన గతంలో జిల్లా జడ్జిగా పని చేశారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, సంస్థ సీనియర్ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, మాజీ ప్రభుత్వం ప్లీడర్ కిరణ్ కుమార్ గౌడ్, న్యాయవాదులు జగన్ మోహన్‌గౌడ్, బిట్ల రవి ఉన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన



నిజామాబాద్ అర్బన్ : ఈసెట్–2023లో భాగంగా స్లాట్‌బుకింగ్ చేసుకున్న విద్యార్థులకు సోమవారం పాలిటెక్నిక్ కళాశాలలో ధృవపత్రాల పరిశీలన కొనసాగింది. 340 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ఈనెల 2వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని కన్వీనర్ శ్రీరాం కుమార్ తెలిపారు. ఈనెల 4వ తేదీలోపు కళాశాలలు ఎంపిక చేసుకోవచ్చని https://tsecet.nic.in లో చెక్ చేసుకోవచ్చన్నారు.

బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన



సుభాష్‌నగర్ : జిల్లాలోని 13 మండలాల బీజేపీ అధ్యక్షుల మార్పును నిరసిస్తూ సోమవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బోధన్ నియోజకవర్గంలో 4 మండలాలతో పాటు ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్‌కు చెందిన మాజీ మండల అధ్యక్షులు, నాయకులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఎంపీ అర్వింద్, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు పార్టీ ఆఫీస్ ఎదుట బందోబస్తు నిర్వహించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి అక్కడికి చేరుకోగా అప్పటికే నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అడిషనల్ డీసీపీగా జయరాం

ఖలీల్‌వాడి : జిల్లాకు లాఅండ్ ఆర్డర్ అదనపు డీసీపీగా జయరాం బదిలీపై వస్తున్నారు. అలాగే ఈనెల 30న రాత్రి డీజీపీ తెలంగాణ వ్యాప్తంగా డీఎస్పీలు, ఏసీపీలను 67 మందిని బదిలీ చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. డీఎస్పీ కెఎం కిరణ్‌కుమార్ వెయిటింగ్‌లో ఉండగా నిజామాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. డీఎస్పీ కె రాజశేఖర్‌రాజు వెయిటింగ్‌లో ఉండగా నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వస్తున్నారు. డీఎస్పీ అంబటి రవీందర్‌రెడ్డి వెయిటింగ్‌లో ఉండగా సీసీఆర్‌బీ, ఫంక్షన్ వర్టికల్‌కు బదిలీపై వస్తున్నారు.

కార్మిక సంబురం

ఆర్టీసీ ఇక ప్రభుత్వ సంస్థ..
- ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్న సంస్థ సిబ్బంది
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 2475 మందికి కలుగనున్న ప్రయోజనం



నిజామాబాద్-1 డిపో ఎదుట పటాకులు కాలుస్తున్న ఉద్యోగులు

ఖలీల్‌వాడి : ప్రజారవాణాలో కీలకమైనది ఆర్టీసీ. ఈ సంస్థ వచ్చిన ఆదాయంతోనే ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పిస్తూ మరోవైపు ఉద్యోగులకు జీతాలు అందిస్తూ వస్తోంది. సరైన ఆదాయం లేకపోవడంతో నష్టాల్లో కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు వారి కల సాకారమవుతోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ సోమవారం మంత్రి వర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. కార్మికులు, ఉద్యోగులు డిపోల ఎదుట బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు.

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోల ద్వారా ప్రజారవాణా సాగుతోంది. ప్రతి రోజు సంస్థకు రూ.90 లక్షల ఆదాయం వస్తుంది.

మొత్తం 2475 మంది ఉద్యోగులున్నారు. ఇందులో 1063 మంది కండక్టర్లు, 902 మంది డ్రైవర్లు 510 మంది శ్రామికులు, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు. వీరితో పాటు అసిస్టెంట్ డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్లు, డిప్యూటీ ఆర్‌ఎంలు, ఆర్‌ఎం ఉన్నారు. ఇక వీరందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా చెలామణి కానున్నారు.

కేబినెట్‌లో నిర్ణయం..

సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఈ బిల్లును ఆమోదం చేయనున్నట్లు మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తరువాత ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా చెలామణి అవుతారు. విధి విధానాలు ఖరారు అనంతరం ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా అన్ని సదుపాయాలు కల్పించే అవకాశాలు ఉన్నాయి.

54 రోజుల పాటు సమ్మె

ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలకు చెందిన ఉద్యోగులు ఆర్టీసీ జేఏసీ ద్వారా 54 రోజుల పాటు సమ్మె నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటిస్తామని తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ దిశగా చర్యలు కనిపించక పోవడంతో ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు దిగారు.



నిజామాబాద్ డిపో ఎదుట నినాదాలు చేస్తూ సంబురాలు చేసుకుంటున్న ఉద్యోగులు

ఉద్యోగుల హర్షం..

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయనున్నట్లు రాష్ట్ర మంత్రివర్గం ప్రకటించడంతో కార్మికులు సంబురాల్లో మునిగిపోయారు. నిజామాబాద్–1 డిపో ఎదుట కండక్టర్లు, డ్రైవర్లు, కార్మికులు, డిపో సిబ్బంది బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకుని ప్రభుత్వానికి అనుకూలంగా వారు నినాదాలు చేశారు.

కదిలేదే లేదు..



- బదిలీలకు వారు అతీతం
- ఏళ్లుగా ఒకేచోట కొనసాగుతున్న పలువురు అధికారులు
- పలుకుబడితో లాబీయింగ్
- వెల్లువెత్తుతున్న విమర్శలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అధికారులు ఏవిధమైన పక్షపాత వైఖరి లేకుండా విధులు నిర్వర్తించే ఉద్దేశంతో ఆయా శాఖలను బట్టి ప్రభుత్వం బదిలీలు చేయడం పరిపాటి. పరిచయాలు ఎక్కువగా ఉంటే కీలక సమయాల్లో నిర్ణయాలు తీసుకునే విషయంలో అటూ ఇటూ అయ్యే అవకాశాలున్న నేపథ్యంలో బదిలీలు అనేవి తప్పనిసరి. కొన్ని శాఖల్లో అయితే సొంత జిల్లాలు, సొంత ప్రాంతాలు ఇవ్వని విధంగా నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ పలువురు అధికారులు కచ్చితమైన లాబీయింగ్ చేసుకుంటూ తమకు నచ్చిన జిల్లాల్లో, నచ్చినన్ని రోజులు కదలకుండా ఉండిపోతున్నారు. నిజామాబాద్ జిల్లాలో సైతం ఇలాంటి అధికారులు పలువురు ఏళ్లుగా కొనసాగుతుండడం గమనార్హం. జిల్లా సహకార అధికారిగా ఉన్న సింహాచలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చారు. ఆయన ఏడేళ్లుగా బదిలీ కాకుండా ఇక్కడే ఉంటున్నారు. జిల్లా ప్రజాపరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా గోవింద్ నాయక్ నాలుగు సంవత్సరాలుగా, గనుల శాఖ ఏడీ సత్యనారాయణ ఏడేళ్లుగా విధుల్లో కొనసాగుతున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం 2017 నుంచి ఇన్‌చార్జి హోదాలోనే పని చేస్తున్నారు. మధ్యలో ఐదు నెలల పాటు రెగ్యులర్ అధికారి బాలనరేందర్ రాగా ఆయన ఆకస్మికంగా మరణించారు. మళ్లీ అప్పటి నుంచి డాక్టర్ సుదర్శనం ఇన్‌చార్జి అధికారిగా కొనసాగుతున్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సింగ్‌దాస్ ఐదు సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారి దేవేంద్రప్రసాద్ ఐదేళ్లుగా, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ నాలుగేళ్లుగా, జిల్లా మార్కెటింగ్ అధికారి గంగు నాలుగేళ్లుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మూడు సంవత్సరాలుగా ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉంటున్నారు. ఇక పంచాయతీరాజ్ ఈఈ శంకర్ మూడేళ్లుగా, మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజేంద్రకుమార్ నాలుగేళ్లుగా కొనసాగుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమైన శాఖల్లో బదిలీలు చేస్తున్నప్పటికీ.. ఏళ్లతరబడి కొనసాగుతున్న అధికారులను మాత్రం కదిలించక పోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా కీలకమైన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టు భర్తీ చేయక నాలుగు నెలలు గడిచిపోయింది. శాంతిభద్రతల పరంగా నిజామాబాద్ అతి సున్నితమైన ప్రాంతం. ఇక్కడ సీపీగా పనిచేసిన నాగరాజు గత మార్చి 31న రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ పోస్టులో పూర్తి స్థాయి అధికారిని కేటాయించలేదు. నిర్మల్ జిల్లా ఎస్పీకి నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీగా బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

ఐటీ హబ్‌లో కంపెనీని స్థాపించండి



గ్లోబల్ లాజిక్ కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- గ్లోబల్ లాజిక్ కంపెనీని కోరిన ఎమ్మెల్సీ కవిత
- నేడు ఐటీ హబ్‌ను సందర్శించనున్న కంపెనీ ప్రతినిధులు

నిజామాబాద్ నాగారం : త్వరలో ప్రారంభం కానున్న ఐటీ హబ్‌లో కంపెనీని స్థాపించాలని అంతర్జాతీయంగా పేరొందిన హిటాచీ గ్రూప్ సబ్సిడరీ సంస్థ గ్లోబల్ లాజిక్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. సోమవారం సంస్థ వైస్ ప్రెసిడెంట్ గురు కమకొలను, కంటెంట్ ఇంజినీరింగ్ విభాగం వైస్ ప్రసిడెంట్ కృష్ణ మోహన్ వీరవల్లి ఎమ్మెల్సీ కవితతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఇందులో ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఐటీ హబ్ అక్కడి రవాణా, నీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలతో పాటు శాంతి భద్రతల గురించి కంపెనీ ప్రతినిధులకు కవిత వివరించారు. ఐటీహబ్ వరకు బస్సులు నడిపేవిధంగా కృషిచేస్తానని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్‌లో తాము కల్పించే ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తరిస్తామన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రధాన కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లోబల్ లాజిక్ సంస్థకు హైదరాబాద్‌లో రెండు క్యాంపస్‌లలో సుమారు 3వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ గ్లోబల్ లాజిక్ కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం సంతోషకరమన్నారు. యువతకు స్థానికంగానే ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ అన్ని జిల్లాల్లో ఐటీ హబ్‌లు ఏర్పాటు చేశారన్నారు. స్థానిక యువత ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నేడు గ్లోబల్ లాజిక్‌కు సంబంధించిన ప్రతినిధులు మంగళవారం జిల్లా కేంద్రంలో ఉన్న ఐటీ హబ్‌ను సందర్శించనున్నారు.

నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల మార్పు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ల సౌకర్యం ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులకు ప్రతిపాదనలు రూపొందించామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు విలీనమయ్యే కేంద్రాల ప్రతిపాదనలపై పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా చర్చించారు. 1400 పైచిలుకు ఓటర్లు ఉంటే, కొత్త కాలనీల్లో, 2 కిమీ పరిధిలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. జిల్లాలో కొత్తగా 40 కేంద్రాలు ప్రతిపాదించామని, కేంద్రాల సంఖ్య 1,549కి ఆమోదానికి ఆగస్ట్ 4వ తేదీ లోపు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సందేహాలను నివృత్తి చేశారు. ఫొటో సిమిలర్ ఎంట్రీ విధానం ద్వారా ఓటరు జాబితాలో దాదాపు 99శాతం డుప్లికేషన్ ఓట్లు తొలగించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్ తదితరులున్నారు.

క్రీడా ప్రాంగణాలకు పరికరాలు

నిజామాబాద్ నాగారం : జిల్లాలో క్రీడా ప్రాంగణాల అభివృద్ధిపై ప్రభుత్వం ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లాలో క్రీడా ప్రాంగణాలకు క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులను అందజేయనున్నారు. సోమవారం రాత్రి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత సమాచార కాపీని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న అందుకున్నారు.

మంగళవారం నుంచి జిల్లాలోని ఆయా మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయాలకు సుమారు 12 క్రీడలకు సంబంధించి క్రీడా పరికరాలు అందజేయనున్నారు. జిల్లాలో 532 గ్రామ పంచాయతీ పరిధిలో ఒక్కో క్రీడా ప్రాంగణంలో క్రీడాకారుల కోసం 75 టీషర్టులు, పరికరాలు అందజేస్తారు. మున్సిపాలిటీ పరిధిలో భీమ్‌గల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్‌లకు మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తున్నారు. తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు అక్కడి నుంచి నేరుగా ఆయా మండలాలకు, మున్సిపాలిటీలకు క్రీడా పరికరాలు వెళ్లనున్నాయి.

మళ్లీ ఎస్సారెస్పీకి వరద

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి మళ్లీ వరదనీరు పోటెత్తింది. ఆదివారం రాత్రి పది గంటల ప్రాంతంలో ఎగువ నుంచి వరద క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. 52,548 క్యూసెక్కుల మేర వరద పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు రాత్రి 11 గంటలకు 16 వరద గేట్లను ఎత్తి దిగువకు 44,448 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. సోమవారం మధ్యాహ్నానికి ఎగువ నుంచి వరద తగ్గడంతో గేట్లు మూసివేశారు. ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8 వేల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో రెండు గంటల పాటు కొనసాగడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1089.90 (84.29టీఎంసీలు) అడుగులు నిల్వ ఉంది. స్థానిక జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్ల ద్వారా 35.29 మెగావాట్ల విద్యుత్పత్తి జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.



వానొచ్చె.. గంగమ్మ పైకొచ్చె..



నిజామాబాద్‌లో పీజో మీటర్‌లో నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న భూగర్భ జల శాస్త్రవేత్త

- భారీవర్షాలతో వేగంగా పెరిగిన భూగర్భ జలాలు
- జిల్లా సగటు నీటిమట్టం 7.66 మీటర్లు
- సాగుకు ఢోకా లేనట్లే..

మోర్తాడ్(బాల్కొండ) : కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలాల నీటిమట్టం గణంగా వృద్ధి చెందింది. గంగమ్మ తల్లి పైకొచ్చి ఈ సీజన్‌తో పాటు వచ్చే యాసంగి సీజన్‌లో సాగుకు ఎలాంటి ఢోకా ఉండకపోవచ్చని భూగర్భ జల శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గత జూన్ నెలతో పోలిస్తే ఈ నెలలో ఏకంగా నీటిమట్టం 3.87మీటర్లకు పెరిగింది. జూన్‌లో 11.53 మీటర్లలో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.66 మీటర్లకు చేరింది. 2022 జూలై నెలతో పోల్చితే 0.58 మీటర్లు తక్కువగా ఉన్నా ఇప్పుడున్న నీటి మట్టం ఆశాజనకంగానే ఉందని స్పష్టమవుతోంది. జిల్లాలోని 33 మండలాల్లో ఉన్న 81 పీజో మీటర్ల నుంచి నీటిమట్టం వివరాలను భూగర్భ జలాల శాస్త్రవేత్తలు సేకరించారు. వారు వెల్లడించిన ప్రకారం జిల్లాలో సరాసరి నీటి మట్టం 7.66 మీటర్లకు చేరింది. కొన్నిచోట్ల మాత్రం భూమి అనుకూలంగా లేకపోవడంతో వర్షం నీరు భూమిలో ఇంకకపోవడంతో భూగర్భజలాల మట్టం వృద్ధి చెందలేదు.

ఎక్కువ లోతులో నీరు నిలువున్న ప్రాంతాలు

ప్రదేశం	నీటి మట్టం
గోనుగొప్పుల (భీమ్‌గల్)	29.63
కంఠేశ్వర్ (నిజామాబాద్)	23.06
మోపాల్	20.15
సిరికొండ	19.82
చిన్నమావంది (బోధన్)	18.73
సంగెం (బోధన్)	18.33
తాళ్లపల్లి (భీమ్‌గల్)	17.40
గడ్కోల్ (సిరికొండ)	17.55
గూపన్‌పల్లి (నిజామాబాద్)	16.61
చిన్న వాల్గొట్ (సిరికొండ)	16.65
పచ్చల నడ్కుడ (వేల్పూర్)	15.65

మెజారిటీ ప్రాంతాల్లో గణనీయ వృద్ధి..

మెజార్టీ ప్రాంతాల్లో మాత్రం భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందడం మంచి పరిణామమే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 10 మీటర్ల లోతులో నీటిమట్టం ఉన్న ప్రాంతాలు ఆశాజనకమైనవిగా, 10 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నీరు నిక్షిప్తమైన ప్రాంతాలను డేంజర్ జోన్‌గానే పరిగణలోకి తీసుకుంటారు. కొన్నిచోట్ల ఎంత వర్షపాతం ఎక్కువ నమోదైనా నీటిమట్టం మాత్రం పెరుగకపోవడం ఆలోచించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భూగర్భ జలాలు చాలా లోతులో ఉన్న ప్రాంతాల్లోని వారు నీటిని పొదుపుగా వినియోగించాల్సి ఉంది.

కొత్త సీపీ కోసం ఎదురుచూపులు

- పోలీస్ కమిషనరేట్‌లో ముఖ్య అధికారుల పోస్టులు ఖాళీ..!
- మార్చి 31న పదవీ విరమణ చేసిన సీపీ
- ఇన్‌చార్జి సీపీగా నిర్మల్ ఎస్పీ
- రెండు డీసీపీ, రెండు ఏసీపీ పోస్టులకు అధికారుల్లేరు..



జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయం

ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రధానమైన పోస్టులు కొంతకాలంగా ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది మార్చి 31న పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కెఆర్ నాగరాజు పదవీవిరమణ చేశారు. పదవీవిరమణ చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నియామకం జరగలేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేసినా ఇప్పటి పోలీస్ కమిషనర్ కేటాయింపు జరగడం లేదు. నిజామాబాద్‌లో మూడు డీసీపీ పోస్టులు ఉండగా గతంలో డీసీపీలుగా ఉషావిశ్వనాథ్, అరవింద్‌బాబు పని చేశారు. వారు బదిలీపై ఒకరు సిద్దిపేట్‌కుకు మరొకరు కరీంనగర్ వెళ్లారు. అప్పటినుంచి పోస్టులు ఖాళీగాఉండగా తాజా సోమవారం అదనపు డీసీపీగా జయరాంను జిల్లాకు బదిలీ చేశారు.

సీనియర్లకు అదనపు బాధ్యతలు..

స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఉన్న సీనియర్ పోలీసు అధికారి మధుసూదన్‌రావును అదనపు డీసీపీ(అడ్మిన్) హోదా ఇచ్చారు. వారంక్రితం ఏసీపీ మధుసూదన్‌రావుకు అడిషనల్ ఎస్పీ ప్రమోషన్ రావడంతో బదిలీపై వెళ్లారు. దీంతో ఇప్పుడు ఏసీపీ శ్రావణ్‌కుమార్‌కు ఆ బాధ్యతలు అప్పజెప్పారు. ఏఆర్ ఏసీపీలో రెండు పోస్టులు ఉండగా ఏసీపీగా గిరిరాజు పని చేస్తున్నారు. ప్రస్తుతం ఏసీపీ గిరిరాజు సెలవులో ఉన్నారు. జిల్లాలో ఏడు ఏసీపీలు పోస్టులు ఉండగా అందులో నిజామాబాద్ ఏసీపీగా కిరణ్‌కుమార్, బోధన్ ఏసీపీగా విజయసారథి, ఆర్మూర్ ఏసీపీగా జగదీష్ చందర్, మరో ఏసీపీగా శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీగా నారాయణ ఉన్నారు. దీంతో ఏఆర్‌తో పాటు మరో ఏసీపీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. అలాగే నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వరిస్తున్నారు. జిల్లాలో నాలుగు నెలలు కావస్తున్నా ఇంతవరకు సీపీని నియమించకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 47 మంది ఎస్సైల బదిలీలు జరగగా జిల్లాకు ఎస్సైలు తక్కువగా వచ్చారు. అలాగే ఎస్సైలకు పూర్తిస్థాయి బాధ్యతలు ఇవ్వలేదు. సీపీ వచ్చిన తర్వాత ఎస్సైల పనితీరు మేరకు పూర్తిస్థాయి పోస్టింగ్ ఇస్తారనే చర్చ పోలీస్‌వర్గాలలో వినిపిస్తుంది.

క్లుప్తంగా

వర్సిటీలో క్రీడా సౌకర్యాలు మెరుగు పరచాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ వర్సిటీ ఇన్‌చార్జి తరుణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేతను కలిసి వినతి పత్రం అందజేశారు. వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులు అనేక పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని, వారు రన్నింగ్ తో పాటు ఇతర క్రీడల్లో నైపుణ్యం మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్యాంపస్ మైదానంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సామగ్రిని అందుబాటులో ఉంచాలని కోరారు.

3లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 2వ, 3వ, 4వ సెమిస్టర్ (2019, 2020, 2021, 2022 బ్యాచ్‌ల)బ్యాక్‌లాగ్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు తుది గడువు ఆగస్టు 3 అని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఆగస్టు 4వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

తెయూ న్యాయశాస్త్ర విభాగాధిపతిగా ప్రసన్నరాణి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా డాక్టర్ ప్రసన్నరాణి నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి సోమవారం ప్రసన్నరాణికి నియామక ఉత్తర్వులను అందజేశారు. ప్రసన్నరాణికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ త్వరగా పూర్తి చేసుకుని గాలి కుంటు టీకాలు వేయించాలని జిలా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నథచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2లక్షల పైచిలుకు గేదెలు, ఆవులు 1లక్షకు పైగా ఉన్నాయన్నారు. వీటికి ఈ వారంలో నట్టల నివారణ మందులను వేయించాలని సూచించారు. రెండు, మూడు రోజులు తర్వాత గాలికుంటు టీకాలు వేయించాలని, అన్ని మండలాలకు మందులను సరఫరా చేసినట్లు తెలిపారు.

'నాకు నోటీసులు రాలేదు'

నిజామాబాద్ సిటీ: జీజీహెచ్‌లో జరిగిన రెమిడిసివర్ ఇంజెక్షన్ల మిస్సింగ్ వ్యవహారంలో లోకాయుక్త ఎదుట సమాధానం చెప్పమని తనకు ఎలాంటి నోటీసులు రాలేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వెల్లడించారు. జూలై 28న తాను లోకాయుక్త ఎదుట హాజరు కావాలని ఎవరు నోటీసులు జారీ చేయలేదని చెప్పారు. ఈ వ్యవహారంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు నోటీసులు వెళ్తాయని, తనకు నేరుగా నోటీసులు జారీ కావన్నారు. డీఎంఈ ఆదేశాలు జారీ చేస్తే తాను లోకాయుక్త ఎదుట హాజరవుతానని చెప్పారు. విషయం తెలియని సీసీఎస్ ప్రతినిధులు సోషల్ మీడియాలో ప్రచారం చేయటం సరికాదన్నారు.

సమ్మెలో కార్మికులు... సమస్యల్లో జీపీలు

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- వ్యాధులు ప్రబలే అవకాశం



మోర్తాడ్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు ఇతరత్రా డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికులు, ఇతర ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించలేక పంచాయతీల్లో ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీల్లో మల్టిపర్పస్ విధానం తొలగించాలని కారోబార్లు, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ కార్యదర్శులుగా గుర్తించి పనికి తగిన వేతనం చెల్లించాలనే డిమాండ్ వినిపిస్తుంది. పారిశుధ్య కార్మికులకు నెలకు కనీసం రూ.15,500 వేతనంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలని, వేతనాలను ప్రభుత్వమే చెల్లించాలని కోరుతున్నారు. మే నెలలో పంచాయతీ ఉద్యోగులు సమ్మెకు ఉపక్రమించగా ఇప్పటి వరకు చెల్లిస్తున్న రూ.8,500లకు అదనంగా రూ.వెయ్యి చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించింది. పెంచిన వేతనాన్ని కూడా పంచాయతీలే భరించాలని నిర్ణయించడంతో అదనపు భారం ఏర్పడింది. పంచాయతీల్లో నిధుల కొరతతో వేతనాలు సకాలంలో చెల్లించే పరిస్థితి లేకపోయిందని కొత్తగా పెంచిన వేతనాలు ఎలా ఇస్తారని పంచాయతీ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంటు ద్వారా వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో 2,720 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో బాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చే పరిస్థితి లేదు.

పంచాయతీల్లో పారిశుధ్య సమస్య

పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోతుంది. డ్రెయినేజీలు తీసే వారు లేక వర్షానికి మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో అద్దె ప్రాతిపదికన కార్మికులను రప్పించే పరిస్థితి లేదు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పంచాయతీ ఉద్యోగులతో చర్చలను జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ముఖ్య నేతలను కలిసిన సంఘం నాయకులు

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ కారోబార్ల సంఘం, పంచాయతీ కార్మికుల యూనియన్ ప్రతినిధులు ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించేలా కృషి చేయాలని వేడుకున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం



ధర్నాలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

- కలెక్టరేట్ వద్ద ధర్నాలో జీపీ కార్మికులు
- డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేత

సుభాష్‌నగర్: గ్రామపంచాయతీ కార్మికులు, కారోబార్లు, సిబ్బంది సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమిస్తామని జేఏసీ నాయకులు నూర్జహాన్, దాసు, సుధాకర్ పేర్కొన్నారు. 26 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి జేఏసీ పిలుపునిచ్చింది. ఆ మేరకు జిల్లా నలుమూలల నుంచి జీపీ కార్మికులు, కారోబార్లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు ఖానాపూర్ బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణం జీపీ కార్మికుల నినాదాలతో హోరెత్తింది. సుమారు రెండు గంటల పాటు గేట్ ఎదుట బైఠాయించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జీవోనెంబర్ 60ని అమల్జేయాలని, పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కారోబార్లకు బిల్ కలెక్టర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జేఏసీ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, పంచాయతీ యూనియన్ నాయకులు రమేష్‌బాబు, జంగం గంగాధర్, నన్నేసాబ్, జేపీ గంగాధర్, శివకుమార్, ఖాజా మొయినుద్దీన్, వెంకటి, మల్లేశ్, రమేశ్, సాగర్, మీన్‌కుమార్, రంజిత్‌గౌడ్, నవీన్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని తెయూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రిజిస్ట్రార్ చేతుల మీదుగా డిమాండ్లతో కూడిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్‌బీ రవికుమార్, అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, బికోజీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వ్యవస్థ అనే పదాలు లేకుండా చేస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలన్నారు. నరేష్, రవీందర్, రమేష్, శ్రీధర్, గణేశ్, దిగంబర్, క్రాంతి, పుణ్యవర్ధన్, మమత, శోభారాణి, మౌనిక, వకుల, పద్మ, రాము పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీకాలం పొడిగింపు



నిజామాబాద్‌అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆరుట్ల రాజేశ్వర్ పదవీ కాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్లు పదవిలో కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని రాజేశ్వర్ సెక్రెటేరియట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

జుక్కల్ టికెట్ మాదిగలకే కేటాయించాలి

మద్నూర్(జుక్కల్): జుక్కల్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ టికెట్ మాదిగ కులస్తులకు కేటాయించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రావ్ సంఘం మాదిగ దండోరా సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ..జుక్కల్‌లో గతంలో చాలాసార్లు మాల సామాజికవర్గానికి వివిధ పార్టీలు అవకాశం ఇచ్చాయని ఈ సారి మాదిగ సామాజికవర్గానికి బీఆర్‌ఎస్ తరపున టికెట్ ఇవ్వాలని కోరారు. లచ్మయ్య, శివయ్య, సాయిలు, దత్తు, తదితరులున్నారు.

అంటరానితనాన్ని ప్రోత్సహిస్తే చట్టరీత్యా చర్యలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంటరానితనాన్ని ప్రోత్సహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ అంజయ్య అన్నారు. సోమవారం వడ్లంలో పౌర హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పౌరునికి మానవ హక్కుల చట్టం, అట్రాసిటీ కేసులపై అవగాహన ఉండాలన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో డీఈవో అనుమతి లేకుండా విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధులను లోనికి అనుమతించరాదని విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తెయూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు లవిశెట్టి ప్రసాద్, కె శ్రీశైలం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు బయటకు తెలుస్తాయనే భయంతోనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇలాంటి ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫామ్స్ ఇవ్వలేదన్నారు. పాఠశాలల్లో వసతుల కల్పన కోసం మన ఊరు– మన బడి పథకం కింద మంజూరు చేసిన నిధులు కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ఉపయోగపడ్డాయని విమర్శించారు. వెంకటేష్, సంధ్యారెడ్డి, నవీన్, చిత్ర, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్, కాంట్రాక్టర్‌పై స్పీకర్ ఆగ్రహం



పబ్లిక్‌అండ్‌హెల్త్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: బాన్సువాడలో చేపడుతున్న మున్సిపల్ భవన నిర్మాణంపై పబ్లిక్ అండ్ హెల్త్ శాఖ డీఈ, ఏఈ, కాంట్రాక్టర్‌పై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్ కార్యాలయం ముందు రూ. 2 కోట్ల నిధులతో మున్సిపల్ నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు. స్వయంగా రెండు సార్లు స్పీకర్ స్థలాన్ని పరిశీలించి భవనం ఎలా నిర్మించాలో అధికారులకు, కాంట్రాక్టర్‌కు వివరించారు. స్పీకర్ చెప్పిన చోట కాకుండా వేరే చోట భవనం నిర్మించడంతో ఇప్పటికే రూ.2 కోట్ల నిధులు పూర్తయ్యాయి. అయినా భవనం పనులు ఇంకా మిగిలిపోవడంతో డీఈ సంతోష్, ఏఈ శ్రీకాంత్‌పై స్పీకర్ మండిపడ్డారు. రూ.2 కోట్లతో కామారెడ్డిలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం పూర్తయిందని, బాన్సువాడలో రూ.కోటి నిధులతో ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణం పూర్తియిందని స్పీకర్ అన్నారు. కానీ అధికారులు, కాంట్రాక్టర్ చేసిన తప్పిదంతో భవనం పూర్తి కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భవనం పూర్తి కావాలంటే మరో రూ.కోటి నిధులు అవసరముంటుందని అధికారులు చెప్పడంతో తన వద్ద మాత్రం నిధులు లేవని, మున్సిపాలిటీ నుంచి సమకుర్చుకోవాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, అంజిరెడ్డి, ఎజాస్, కృష్ణారెడ్డి, శ్రావణ్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

మంచిప్పలో కేంద్ర బృందం తనిఖీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్పలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఈజీఎస్ నిధులతో గ్రామంలో చేపట్టిన పనుల వివరాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, రైతు వేదిక, సబ్ సెంటర్, డ్రెయినేజీలు, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. పీడీ ఫయాజ్, ఏపీడీ ఓం పాల్ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. అంతకుముందు కేంద్ర బృందాన్ని జీపీలో సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీష్, ఎంపీడీఓ లింగం సన్మానించారు. ఎంపీవో ఇక్బాల్, ఏపీవో సునీత, వీడీసీ అధ్యక్షుడు నవీన్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు. 2016లో ఇంకుడు గుంతను తవ్వుకుంటే ఇప్పటికీ తనకు పేమెంట్ ఇవ్వలేదని గ్రామానికి చెందిన సాయిరాం పీడీ ఫయాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్ వినతులు స్వీకరించారు.

బేబీ ఫీడింగ్ గది ప్రారంభం



బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో రాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ గదిని సోమవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. రాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కండక్టర్ నాగరాజు ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ గది ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. చిన్న పిల్లల ఏడుస్తూంటే బస్టాండ్‌లో చాలా మంది ఇబ్బందులు పడుతుంటారని, వారి అవసరాలని గుర్తించి ఫీడింగ్ గదిని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నాగరాజును అభినందించారు. ఆయన వెంట డీఎం సదాశివ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, వెంకట్‌రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జంగమాయిపల్లిలో సోమవారం బోధనం భద్రయ్య ఇంటిపై చెట్టు కూలిందని గ్రామస్తులు తెలిపారు. ఈదురు గాలులతో పాటు వర్షం కురవడంతో ఇంటిపై చెట్టు పడిందని అన్నారు. దీంతో భద్రయ్య ఇంటి పైకప్పు దెబ్బతిన్నదని అన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నారు.

నిరుద్యోగులకు వరం 'సంకల్ప' పథకం

కామారెడ్డి అర్బన్: నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ పొందడానికి సంకల్ప పథకం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.మధుసూదన్‌రావు పేర్కొన్నా రు. సంకల్ప పథకం కింద కామారెడ్డిలో సోమవారం నిరుద్యోగులకు అవగాహన, నైపుణ్య సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ రామరాయలు, సమన్వయకర్త దుర్గారెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఏంజీఎంఎఫ్ ప్రద్యుమ్నరెడ్డిలు వివిధ పథకాలు, ఉచిత శిక్షణ, ఉపాధి పథకాలు, రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నిరుద్యోగులకు వివిధ నైపుణ్య సమాచారం ప్రతులను అందించారు.

క్రైం కార్నర్

సెల్‌ఫోన్ దుకాణాల్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కొత్తబస్టాండ్ ప్రాంతంలో వెంకటేశ్వర టాకీస్ సందులో ఆదివారం రాత్రి రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో చోరీ జరిగింది. మొత్తం ఐదు దుకాణాల్లో చోరీకి ప్రయత్నించగా మూడు దుకాణాల షెటర్లు తెరుచుకోకపోవడంతో ఈశ్వరీ, మోసిన్ సెల్‌ఫోన్ దుకాణాల్లో దొంగతనం చేశారు. ఈశ్వరి సెల్‌పాయింట్‌లో నాలుగు ఫోన్లు, రూ.10వేలు, మోసిన్ షాప్‌లో 15 స్మార్ట్‌ఫోన్‌లు, రూ.70 వేల నగుదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసుల ఘటన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

మద్నూర్: మద్నూర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలో జూలై 26న జరిగిన బ్యాటరీల దొంగతనం కేసులో మండలానికి చెందిన ఓ బాలుడిని సోమవారం జువైనల్ జస్టిస్ బోర్డ్ ఎదుట ప్రవేశపరిచి అబ్జర్వేషన్ హోమ్‌కి పంపినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. బాలుడికి సహకరించిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సదరు బాలుడు గతంలో ఎంపీడీవో కార్యాలయంలో సెంట్రింగ్ బాక్స్‌లు చోరీ చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితులు!

రెంజల్: బాలికలను కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులకు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. గత నెల 18న రెంజల్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న దూపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులను అదే గ్రామానికి చెందిన యువకులు కిడ్నాప్ చేసినట్లు బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు బాలికల కోసం దర్యాప్తు ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు బాలికలతో పాటు కిడ్నాప్ చేసిన యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా కేసును సీఐ దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

నకిలీ గుళికలు అమ్మిన వ్యక్తి అరెస్ట్

- రూ.39కి కొని రూ.650కి విక్రయం
- రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి..



రైతులతో మాట్లాడుతున్న ఫటేరా కంపెనీ ప్రతినిధులు, పోలీసులు

బాన్సువాడ: బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో నకిలీ గుళికల మందు విక్రయించిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మండలంలోని తిమ్మాపూర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్ యజమాని కృష్ణ రెండేళ్లుగా ఢిల్లీ నుంచి తెచ్చిన నకిలీ ఫటేరా గుళికల మందులు రైతులకు విక్రయిస్తున్నాడు. ఆ గుళికలు వాడినా పంటలో ఎలాంటి ఎదుగుదల లేకపోవడంతో తిమ్మాపూర్, నస్రూల్లాబాద్ మండలం మిర్జాపూర్, వీరాపూర్ గ్రామాల రైతులు ఫటేరా కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీంతో కంపెనీ నుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి వారు వాడిన ఫటేరా గుళికల మందును పరిశీలించారు. ఫటేరా పేరుతో ఉన్న నకిలీ గుళికల మందులను గుర్తించారు. ఈ గుళికల మందులు అమ్మిని ఫర్టిలైజర్ యజమాని కృష్ణను పట్టుకుని అడుగగా రెండేళ్లుగా ఢిల్లీ నుంచి నకిలీ గుళికల మందు తీసుకు వస్తున్నట్లు ఒప్పుకున్నాడు. 4 కిలోల ప్యాకెట్ రూ.39కే కొని రైతులకు రూ.650కు విక్రయిస్తున్నానని అంగీకరించాడు. ఫర్టిలైజర్ దుకాణంలో ఉన్న 26 నకిలీ గుళికల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కంపెనీ ప్రతినిధులు ఏవో కమల సమక్షంలో విచారించి ఫర్టిలైజర్ యజమాని కృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా ఆటో బోల్తా

- పది మందికి గాయాలు



ధ్వంసమైన ఆటో

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. కేశ్‌పల్లిలో అంత్యక్రియలకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు రాములు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాములు అంత్యక్రియలకు ఆర్మూర్ పట్టణంలోని పిప్రి గల్లీకి చెందిన తొమ్మిది మంది ఆటోను కిరాయికి మాట్లాడుకుని కేశ్‌పల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో సికింద్రాపూర్ గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న పది మందికి గాయాలయ్యాయి. ఏఎస్సై వెంకట్‌కుమార్ సిబ్బందితో వెళ్లి గాయాలైన వారిని ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



కామారెడ్డి క్రైం: నేరాల నియంత్రణకు సహకరించాలని కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి సాయి సద్గురు కాలనీలో సోమవారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పరిసర ప్రాంతాలను, వాహనాలను త నిఖీ చేశారు. కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, కౌన్సిలర్ కృష్ణాజీరావు, దేవునిపల్లి ఎస్సైలు రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మద్నూర్: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని బిచ్కుంద సీఐ కృష్ణ అన్నారు. సలాబత్‌పూర్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో ఆయన పా ల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ మ ధ్య కాలంలో సైబర్ మోసాలు చాలా జరుగుతున్నా యని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రయాణాలు సాగించాలని కోరారు. సరైన పత్రాలు లేని 22 బైక్‌లు, మూడు ఆటోలను సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.